

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి ఆధ్వర్యాన శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు 20వ బ్యాచ్‌లో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఏడాది అనుభవం కలిగి 21 సంవత్సరాలు నిండిన వారు ఈ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్‌కు అర్హులన్నారు. 40 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని వివరించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్లను 8074640792, 7382923293ను సంప్రదించాలన్నారు.

వరాలా... వాతలా?

- నేడు లోక్‌సభలో కేంద్ర బడ్జెట్
- రైల్వే ప్రాజెక్టులు, కొత్త రైళ్లపై ఆశలు పెట్టుకున్న జిల్లా ప్రజానీకం
- ఆదాయ పన్ను పరిమితి పెంపు కోసం వేతనజీవుల చూపులు
- వ్యవసాయ రంగంలో సబ్సిడీల కోసం అన్నదాతల ఆశలు

కేంద్రం ప్రభుత్వం శనివారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏటా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపుతున్నా ఈ సారి టిడిపి మద్దతుపై ఎన్‌డిఎ ప్రభుత్వం ఆధారపడి ఉండటంలో కొంత సానుకూలత ఉండొచ్చని అంతా భావిస్తున్నారు. 2024 ఎన్నికల తర్వాత కొలువు దీరిన తర్వాత ఎన్‌డిఎ ప్రభుత్వం జూలైలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు ఏమీ ఇవ్వలేదు. ఈ సారి బడ్జెట్‌లోనైనా జిల్లాకు ప్రాధాన్యత దక్కుతుందని అంతా ఆసక్తిగా చూస్తున్నారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను విషయంలో ప్రతి సారీ కేంద్రం వేతన జీవులకు నిరాశే మిగుల్చుతోంది. ఈ సారి ఆ తరగతికి ఎటువంటి ఊరటనిస్తుందోనని వారూ ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు జిల్లాకు దక్కే రైల్వే ప్రాజెక్టులు, రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరాలు కోసం సిక్కోలు ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎరువులు, విత్తనాల వంటి ఇన్‌పుట్స్ ధరలపై కేంద్ర ప్రభుత్వం ఏటికేడు కోత విధిస్తోంది. వ్యవసాయం భారంగా మారినా కష్టాల మధ్యే అన్నదాతలు సేద్యం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సాధారణ రకం వరికి క్వింటాలుకు రూ.2,300 గ్రేడ్ ఎ రకానికి రూ.2,320లు ప్రకటించినా ఆ ధర రైతులకు దక్కలేదు. మద్దతు ధరలకు గ్యారంటీ చట్టం చేయాలని రైతులు ఆందోళనలు సాగిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం బడ్జెట్‌లో ఏం నిర్ణయం వెల్లడించనుందో రైతులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అన్నదాతలకు ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించే రాయితీలపై రైతాంగం ఎదురుచూస్తోంది. వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ, బ్యాంకుల నుంచి రుణాల పంపిణీ వంటిలో ఎటువంటి మార్పులు చోటు చేసుకోనున్నాయో? అని అన్నదాతలు ఆశగా ఉన్నారు.

నెరవేరని వెనుకబడిన ప్రాంత గ్రాంట్ హామీ

రాష్ట్ర విభజన చట్టం హామీల్లో భాగంగా వెనుబడిన జిల్లాలకు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున కేటాయించాల్సింది. ఉత్తరాంధ్రలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు, రాయలసీమలోని నాలుగు జిల్లాలకు ఈ నిధులు కేటాయించాల్సి ఉంది. 2015 నుంచి 2018 వరకు ఏటా రూ.50 కోట్లను కేటాయించిన కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి ఆ నిధులను ఆపేసింది. విభజన చట్టంలో పేర్కొన మేరకు వెనుకబడిన ప్రాంత ప్యాకేజి కింద రాయలసీమలోని నాలుగు జిల్లాలు, శ్రీకాకుళంతో సహా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు గ్రాంట్ల రూపంలో సాయం అందించనున్నట్లు జూలై నెలలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇప్పటికీ ఆ సాయం అందించలేదు.

'ఉపాధి'కి కేటాయింపులు అంతంత మాత్రమే

వ్యవసాయ పనులు లేని సీజన్‌లో వ్యవసాయ కార్మికులు, కూలీలకు కాస్తా కూస్తో పనులు కల్పించి ఊతమిస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి స్వల్పంగా కేటాయింపులు పెరిగాయి. 2023-24 బడ్జెట్‌లో రూ.60 వేలు కోట్లు కేటాయించగా, 2024-25 బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించారు. జిల్లాలో మొత్తం 7.32 లక్షల మందికి జాబ్ కార్డులు జారీ చేయగా, 6.07 మంది కూలీలు పనుల్లోకి క్రమం తప్పకుండా వస్తున్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఎంత మేర నిధులు కేటాయిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

రైళ్లు, రైల్వే ప్రాజెక్టులపై ఏం నిర్ణయాలో

శ్రీకాకుళం రోడ్డును మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దనున్నట్లు గతంలో హామీనిచ్చినా అంతంతమాత్రంగానే అమలవుతోంది. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేస్తామని 2012-13 రైల్వే బడ్జెట్‌లో ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. జిల్లాలోని జి.సిగడాం నుంచి రాజాం మీదుగా విజయనగరం జిల్లా బొబ్బిలిని కలుపుతూ గతంలో రూ.60 లక్షలతో సర్వే చేశారు. ఇప్పటివరకు దానికి అతీగతి లేదు. ఈ స్టేషన్ మీదుగా వెళ్తున్న యశ్వంత్‌పూర్ - హౌరా, పూరీ - అహ్మదాబాద్ రైళ్లు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌లో సుమారు 22కు పైగా ఎక్స్‌ప్రెస్‌లు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. ప్రతి వారమూ ఐదారు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ స్టేషన్ మీదుగా ప్రయాణిస్తున్నా, హాల్టింగ్ లేదు. విశాఖ-హడ్డుబంగి ప్రాంతానికి కొత్త రైలు మార్గం వేయనున్నట్లు ప్రకటించినా, దానిలోనూ కదలిక లేదు. రైళ్లకు హాల్ట్‌లు, జిల్లా మీదుగా వెళ్లే కొత్త రైళ్లపై జనం ఆశలు పెట్టుకున్న ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లుతుందా? లేక నెరవేరుస్తుందా? అనేది వేచి చూడాల్సి ఉంది.

ఆదాయపు పన్ను పెంపుపై వేతన జీవుల ఆశలు

పన్నుల విషయంలో గతేడాది జూలైలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు నిరాశే మిగిల్చింది. ప్రస్తుత మున్న ఆదాయపన్ను పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచాలని ఉద్యోగులు ఆశిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం గత బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితి స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేలు నుంచి రూ.75 వేలకు పెంచి చేతులు దులుపుకుంది. ఈ సారి బడ్జెట్‌లోనైనా వారికి తీపి కబురు ఉంటుందని అంతా ఆశిస్తున్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రథసప్తమి సంబరాలకు చురుగ్గా ఏర్పాట్లు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి రథసప్తమి వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకలు 2న ఉదయం సామూహిక సూర్య నమస్కారాలతో ప్రారంభమవుతాయని అన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2న నగరంలోని 80 అడుగుల రోడ్డులో సుమారు మూడు వేల మందితో సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ వేడుకల ప్రారంభం రోజు శోభాయాత్ర ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలతో పాటు గ్రామీణ క్రీడలైన కర్రసాము, సంగిడీలు, ధాన్యం గోనెలు ఎత్తడం, వెయిట్ లిఫ్టింగ్ వంటి పోటీలు నిర్వహిస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, తప్పెగుళ్లు, చెంచు బాగోతం, చెక్కభజన, తుర్పు భాగవతం, తాలీ ఖానా, నాద స్వరం, డప్పు వాయిద్యం, గిరిజనుల ధింసా నృత్యం, నేలవేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. తొలిసారి జిల్లాలో హెలికాప్టర్ టూరిజం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3న ప్రముఖ సంగీత విద్వాంసుడు గణపతి శర్మ, నీరజా సుబ్రమణ్యం, శ్రీకాంత్ బృందాలతో డ్యాన్సులు, సంప్రదాయ నృత్యాలు, గాయని మంగ్లీతో ఆర్కెస్ట్రా వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అధిక సంఖ్యలో యాత్రికులు వస్తున్నందున వారికి అవసరమైన రవాణా, వైద్య, భోజనం, వసతి సదుపాయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పారిశుభ్యం, తాగునీరు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం, టెక్కలి ఆర్‌డిఒ సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, డిఎస్‌పి సిహెచ్. వివేకానంద, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డిఎస్‌డిఒ శ్రీధర్, పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ పి.సుగుణాకరరావు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలపై రాష్ట్రపతికి లేఖ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలంగా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు సేవలందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు, సహాయకులకు క్రమబద్ధీకరణ, గ్రాట్యుటీ కోరుతూ అఖిలభారత అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖలు పంపించారు. ఈ మేరకు నగరంలోని అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు లేఖ శుక్రవారం ప్రతులను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అంగన్వాడీ వర్కర్సు అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు కె.కళ్యాణి మాట్లాడుతూ సాక్షమ్ అంగన్వాడీ, పోషణ్ 2.0 స్కీమ్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లేఖలు పంపించామన్నారు. అంగన్వాడీ వర్కర్లను, హెల్పర్లను వరుసగా గ్రేడ్-3, 4లుగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని కోరారు. కోర్టు తీర్పును అనుసరించి 7వ పే కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేలకు పెంచాలన్నారు. అలాగే రెగ్యులైజేషన్ బకాయిలను చెల్లించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు అందరికీ వడ్డీతో సహా గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. రాజ్యాంగ ప్రాథమిక హక్కుగా ఉన్న ఆరేళ్ల లోపు వయసు కలిగిన పిల్లలందరికీ శిశుసంరక్షణ, విద్య, అభివృద్ధిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. అందుకు సరిపడా నిధులను బడ్జెట్‌లో కేటాయించాలన్నారు.



లేఖను విడుదల చేస్తున్న అంగన్వాడీలు



పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బాలికల వసతిగృహాల్లో రక్షణ కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవిత్ర, చందు
- దాడిలో గాయపడిన విద్యార్థినికి పరామర్శ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న బాలికల వసతిగృహాల్లో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కొరికాన లక్ష్మిని శుక్రవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. వారిలో మనోధైర్యం కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమారు 1600 మంది విద్యార్థినులు చదువుతున్న ప్రభుత్వ మహిళా కళాశాల, 800 మంది విద్యార్థినులు ఉంటున్న ఆరు వసతిగృహాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయని అన్నారు. అయినా విద్యార్థినులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు హాస్టళ్లు ఉన్న ప్రాంగణం చుట్టూ ఆరు అడుగుల రక్షణ గోడలు నిర్మాంచాలన్నారు. కాలేజీ ఆవరణలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో చీకట్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నీటిని తాగాలంటే తప్పనిసరిగా ఆరుబయటకు రావాల్సి వస్తోందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు ఎస్ఎఫ్ఐ టౌన్ కమిటీ సభ్యులు రాహుల్, జగదీష్ ఉన్నారు.

వి.జి.కె ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కార్మికోద్యమాన్ని ముందుండి నడిపించిన సిఐటియు తొలితరం నాయకులు వి.జి.కె.మూర్తి అని, ఆయన ఆశయ సాధనకు సమిష్టి కృషి చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమావేశం నిర్వహించారు. ముందుగా విజికె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అ సందర్భంగా మాట్లాడుతూ సిఐటియు తొలి జిల్లా అధ్యక్షునిగా ఆయన పనిచేసి కార్మికోద్యమాన్ని బలోపేతం చేయడంలో ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు. శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ లిమిటెడ్ పరిశ్రమలో సిఐటియు అనుబంధ యూనియన్ ఏర్పాటు చేసి 8 నెలల పాటు సుదీర్ఘ సమ్మెకు నాయకత్వం వహించారన్నారు. ఆ సమయంలో కార్మికుల్లో మనోధైర్యాన్ని నింపి అండగా నిలబడి సమస్య పరిష్కారానికి చేసిన కృషి చేశారన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీ ఏర్పాటుకు పాదయాత్ర నిర్వహించారన్నారు. ఈ సభలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న కొరెడ్ల విజయగౌరికి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఆమె విజయానికి సిఐటియు పక్షాన పూర్తి సహకారాన్ని అందించాలని పిలుపు నిచ్చారు. విద్యారంగం, ఉద్యోగుల, ప్రజల సమస్యలు పరిష్కారానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ కృషి చేస్తున్నారని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లుకు వ్యతిరేకంగా ఈ నెల 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో కార్మికవర్గం పాల్గొవాలని కోరారు. రాష్ట్రంలో పారిశ్రామిక కార్మికుల కనీస వేతనాలు గత 16 ఏళ్లుగా సవరించకపోవడంతో కార్మికులు రూ.వందల కోట్లను కోల్పోతున్నారని అన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం, విఒఎల తదితర స్కీం వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో తగిన భద్రతా ప్రమాణాలు లేక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, దీనివల్ల కార్మికులు చనిపోవడం, గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కె.నాగమణి, కె.సూరయ్య, ఎం.ఆదినారాయణమూర్తి, ఎన్.వి.రమణ, అల్లు సత్యన్నారాయణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, జి.అమరావతి, బి.ఉత్తర, ఆర్.ప్రకాశరావు, కె.చంద్రశేఖర్, ధనలక్ష్మి, సుశీల పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిఐటియు నాయకులు

చరిత్రలో మీకో పేజీ ఉండాలి

డిఇఒ తిరుమల చైతన్య



మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

ప్రజాశక్తి- పలాస

ప్రతి విద్యార్థీ చదువుకొనే రోజుల్లో విద్యతో పాటు సామాజిక, సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని చరిత్రలో మీకో పేజీ ఉండేలా చూసుకోవాలని డిఇఒ తిరుమల చైతన్య అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పది, ఇంటర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 'కొడితే సిక్స్ కొట్టాలి రా'... గతంలో 'ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలి' అనేవారు... అంటే మన ఆశయాలు, ఆలోచనలు ఉన్నంతగా ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకోగలమని అన్నారు. దానికి సరైన ప్రణాళిక, సమయ పాలన, క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. నువ్వు గెలిచినప్పుడు మాత్రమే ప్రపంచం నిన్ను గుర్తిస్తుందని, నీవెంట నడుస్తుందని, నువ్వు ఎలా ఉండాలో నువ్వే నిర్ణయించుకోవాలని అన్నారు. దానికి తగ్గట్టు సాధన కూడా చేయాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. పోషకాహారం తీసుకొని సుమారు ఏడు గంటలు నిద్రపోతూ, ఒత్తిడిని అధిగామిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 10వ తేదీ వరకు నామినేషన్ల సమర్పణ, 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని అన్నారు. మార్చి 8న ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. గతేడాది డిసెంబరు 30న ప్రచురించిన తుది ఓటరు జాబితా ప్రకారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజక వర్గం పరిధిలో జిల్లా వరకు గాను, 31 కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా పరిధిలో 4829 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. వారిలో పురుషులు 3275 కాగా, మహిళా ఓటర్లు 1554 మంది ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని అధికారులకు, నాయకులకు సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల సక్రమ నిర్వహణకుగాను నోడల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన అనుమతులను వివరించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, టిడిపి నుంచి జి.ఎం.జె.బాబు, వైసిపి నుంచి రౌతు శంకరరావు, కాంగ్రెస్ నుంచి కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, బిఎస్‌పి నుంచి లాసా సోమేశ్వరరావు, బిజెపి నుంచి సురేష్ సింగ్ పాల్గొన్నారు.

రథసప్తమికి పటిష్ట బందోబస్తు

- సందర్శకులకు ఇబ్బంది లేకుండా చర్యలు
- ఎస్‌పి కె.వి రమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రథసప్తమికి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి కె.వి.రమణ అన్నారు శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎస్‌పి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అరసవల్లి రథసప్తమి వేడుకులను ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 2 నుంచి నాలుగు వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వేడుకలు ప్రశాంతంగా నిర్వహణ, భక్తుల దర్శనం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అరసవల్లి సూర్యనారయణస్వామి దర్శనానికి రూ.500 టిక్కెట్ తీసుకున్న వారికి నలుగురికి, రూ.300 టిక్కెట్ తీసుకున్న వారికి ఇద్దరికి ప్రవేశం కల్పిస్తామని చెప్పారు. డోనర్, క్షీరాభిషేకం టిక్కెట్లు ఉన్నవారు వారికి కేటాయించిన స్లాట్లు సమయాన్ని బట్టి దర్శనానికి రావాలని సూచించారు. శ్రీకాకుళం నగరంలోకి వచ్చే వాహనాలు సింహద్వారం, కొత్త రోడ్డు, పెద్దపాడు కూడలి నుంచి రావాల్సి ఉంటుంటున్నారు. శ్రీకాకుళం నుంచి బయటకు వెళ్లే వారు నవభారత్ జంక్షన్ మీదుగా బయటకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అరసవల్లి ఆర్చ్ ఎదురుగా సూర్యతేజ ఫంక్షన్ హాల్‌కి చెందిన ఖాళీ స్థలంలో వాహనాలను పార్కింగ్ సౌకర్యం కల్పించామని చెప్పారు. డిఎస్‌పి సిహెచ్ వివేకనంద మాట్లాడుతూ అరసవల్లి రథసప్తమి నేపథ్యంలో రెండు, మూడు తేదీల్లో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీక్షించేందుకు వచ్చే వారు కోడిరామ్మూర్తి స్టేడియంలో తమ వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు ఈ నెల 2వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి 4వ తేదీ రాత్రి వేడుకలు ముగిసే వరకు అమల్లో ఉంటయాన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ ఇమ్మ్యాన్యువల్‌రాజు, టౌన్ సిఐ పి.పైడపునాయుడు ట్రాఫిక్ సిఐ నాగరాజు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి రమణ

ట్రాఫిక్ మళ్లింపు ఇలా

ప్రవేశం ఇలా

రూట్ నంబరు 1 : సింహద్వారం మీదుగా వచ్చేవారు కిమ్స్ ఆస్పత్రి, డే అండ్ నైట్, ఏడు రోడ్ల కూడలి, పాతబస్టాండ్, అరసవల్లి మిల్లు కూడలి మీదుగా 80 అడుగుల రోడ్డులోని నిర్ణయించిన పార్కింగ్ స్థలంలో వావానాలను పార్కింగ్ చేయాలి

రూట్ నంబరు 2 : కొత్త రోడ్డు మీదుగా వచ్చే వారు బలగ, ఆర్‌టిసి కాంప్లెక్స్, అంబేద్కర్ కూడలి, డే అండ్ నైట్, ఏడు రోడ్ల కూడలి, పందుంపుల్ల జంక్షన్, పాతబస్టాండ్, అరసవల్లి మిల్లు జంక్షన్‌కు చేరుకుని అక్కడ నిర్ణయించిన స్థలంలో పార్కింగ్ చేయాలి.

రూట్ నంబర్ 3 : పెద్దపాడు నుంచి వచ్చే వాహనాలను రామలక్ష్మణ, సూర్యమహల్ కూడలి, చిన్నబరాటం, పాతబస్టాండ్, అరసవల్లి మిల్లు జంక్షన్‌కు చేరుకుని 80 ఫీట్ రోడ్డులో పార్కింగ్ చేయాలి.

రూట్ నంబర్ 4 : నవభారత్ కూడలి నుంచి వచ్చే సందర్శకులు గుజరాతీపేట, ఏడు రోడ్ల కూడలి, పందుంపుల్ల జంక్షన్, పాతబస్టాండ్ మీదుగా అరసవల్లి మిల్లు జంక్షన్‌కు చేరుకుని 80 ఫీట్ రోడ్డులో పార్కింగ్ చేయాలి.

నరసన్నపేట నుంచి వచ్చే సందర్శకులు 16వ నంబరు జాతీయ రహదారిలో అంపోలు బ్రిడ్జి నుంచి సర్వీస్ రోడ్డులోకి ప్రవేశించి అంపోలు జైలు రోడ్డు మీదుగా ఆడవరం, అంపోలు, అంపోలు కూడలి వద్ద గార రోడ్డు వైపునకు వచ్చి వాడాడ కూడలి వద్ద వాహనాలను నిలపాలి.

రూట్ నంబరు 5 : గార, శ్రీకూర్మం వైపు నుంచి వచ్చే సందర్శకులు వాడాడ కూడలి వద్ద వాహనాలను పార్కింగ్ చేయాలి.

ఖాజీపేట నుంచి వచ్చే సందర్శకులు అరసవల్లి మున్సిపల్ హైస్కూల్ ఖాళీ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేయాలి.

తిరుగు వెళ్లు మార్గం

80 అడుగుల రోడ్డు నుంచి వాంబే కాలనీ పొన్నాడ వంతెన కూడలి, సంతోషిమాత ఆలయం, జెడ్‌పి కార్యాలయం, పాతబస్టాండ్, ఏడు రోడ్ల కూడలి, నుంచి నవభారత్ కూడలి రోడ్డు వైపు వెళ్లాలి.



ఇళ్లను పరిశీలిస్తున్న డిఇఇ సన్యాసిరావు

గృహ నిర్మాణాలు వేగవంతం

హౌసింగ్ డిఇఇ సన్యాసిరావు

ప్రజాశక్తి- బూర్జ

లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్‌శాఖ డిఇఇ సన్యాసిరావు సూచించారు. శుక్రవారం మండలంలోని హరిపురం, పల్లాపురం గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి జన్మాన్ పథకం కింద మండలంలోని వివిధ గిరిజన గ్రామాల్లో 39 గృహాలు మంజూరయ్యాయన్నారు. వాటి నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో పరిశీలించామని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు వీలైనంత తొందరగా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఆయనతో పాటు గృహ నిర్మాణశాఖ ఎఇ లక్ష్మీనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, సిబ్బంది, లబ్ధిదారులు ఉన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

విజయగౌరిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర పరిధిలో 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న కోరెడ్ల విజయగౌరిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉద్యోగ సంఘ నాయకులు కేతవరపు శ్రీనివాసు, ప్రభాకరరావు, పి.సుధాకరరావు కోరారు. ఎచ్చెర్లలోని అంబేద్కర్ యూనివర్సిటీలో వైస్ ఛాన్సలర్, అధ్యాపకులను శుక్రవారం కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ పిడిఎఫ్ బలపరుస్తున్న విజయ గౌరి ఉపాధ్యాయ సంఘం నాయకురాలిగా అనేక పోరాటాల్లో కీలకపాత్ర నిర్వహించారన్నారు. నిజాయితీగా ఉంటూ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యుల తరపున వారి సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపిస్తారన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల ఉద్యమాలకు బాసటగా నిలుస్తారన్నారు. అందుకోసం విజయ గౌరిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని వారు వివరించారు.



కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న రామకృష్ణనాయుడు

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి

బూర్జ: రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ అనెపు రామకృష్ణ నాయుడు అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన సమావేశంలో సివిల్ సప్లై కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్‌ను కోరారు. శ్రీకాకుళం జిల్లాలో ముఖ్యంగా బూర్జ మండలంలో రైతుల ధాన్యం ఇంకా పొలాల్లోనే ఉన్నాయన్నారు. పొలాల్లో పెసర, మినప చేలు ఉండడంతో ధాన్యం ఇంకా నూర్పులు కాకుండానే ఉన్నందున మిల్లర్లకు టార్గెట్లు పూర్తయ్యాయని చెబుతున్నారన్నారు. బూర్జ మండలం, ఆమదాలవలస నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలుకు ఎక్కువ టార్గెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, 70శాతం ధాన్యం పొలాల్లోనే ఉన్నాయని, వాటి కొనుగోలు బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని వివరించి లిఖితపూర్వకంగా తెలియజేసినట్టు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించి మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.



ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రమాద బీమా అందజేత

పోలాకి : మండలంలోని అంపలాం పంచాయతీ రాజారాంపురంలో ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో మైలపల్లి గురుదేవి మృతి చెందారు. ఈ మేరకు మృతుని కుటుంబానికి ప్రమాద బీమా రూ.2 లక్షలు మంజూరైంది. దీని ప్రొసీడింగ్స్‌ను మండలంలోని మబగాంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం తీసుకోవడం వల్ల లబ్ధిచేకూరుతుందన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, నల్లాన వెంకునాయిడు, మైలపల్లి త్రినాథ రావు, కోడ తాతారావు, యు.అప్పలరెడ్డి, డి.తవిటియ్య పాల్గొన్నారు.

సూర్యనారాయణరెడ్డికి సన్మానం

మందస: ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి ప్రజల మనసును గెలుచుకున్నారని విజయనగరం డిప్యూటీ సిఇఒ వెంకటరామన్ అన్నారు. మండల కాంప్లెక్స్‌లో వజ్రపుకొత్తూరు ఎంపిడిఒ రమేష్ నాయుడు అధ్యక్షతన సూర్యనారాయణరెడ్డి ఉద్యోగ విరమణ ఆత్మీయ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరెడ్డి, రజని దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. పైల రజిని లకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీత సోదరుడు పైల తాతారెడ్డి, కుమార్తె డాక్టర్ హర్షితారెడ్డి, కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్‌టిఒ బి.కళ్యాణ్ చక్రవర్తి, ఎపిఎం డి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఒ, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

కోటబొమ్మాళి: పిల్లలు సెల్‌ఫోన్లు వినియోగిచేటప్పుడు వారిపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిని పెట్టాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. వీధి బాలల దినోత్సవం సందర్భంగా అమె కక్షిదారులతో, న్యాయవాదులు, పోలీసులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధి బాలల దినోత్సవం చేసుకోవడం బాధాకరమని, ఎక్కడ వీధి బాలల ఎవరికీ కనిపించిన వెంటనే 1098కు ఫోన్ చేసి వారిని అప్పగించాలని అన్నారు. లేకుంటే సమీపంలోని స్వచ్ఛంద సంస్థలకు, పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ఎవరైనా భార్యాభర్తలు విడిపోయేటప్పుడు ముఖ్యంగా వారి పిల్లల మనసుపై చెడు ప్రభావం పడుతుందని, పిల్లల ముందు పెద్దలు అసభ్య పదాలను వాడరాదని అన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

పెద్దల ప్రవర్తనను పిల్లలు అనుకరిస్తారని అన్నారు. అందుకు చాలా సమతుల్యంతో పెద్దలు వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎజిపి తిరుపతి, న్యాయవాదులు బి. నారాయణరావు, తిరుమలరావు, నరసింహమూర్తి, మన్మథరావు, వై.వెంకటరావు, పూజారి వాసుదేవరావు పాల్గొన్నారు.

సూర్యనారాయణ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రులు ధర్మాన, గుండ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజకీయాల్లో ఉంటూ ప్రజల అభిమానాన్ని పొందిన వ్యక్తి మాజీ జెడ్‌పి చైర్మన్ వై.వి సూర్యనారాయణ అని మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, గుండ అప్పల సూర్యనారాయణ, ధర్మాన కృష్ణదాస్, మాజీ కేంద్రమంత్రి డా. కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, రెడ్డి శాంతి కొనియాడారు. శుక్రవారం మండలం కిల్లిపాలెంలో ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఆయన కిల్లిపాలెం సర్పంచ్‌గా రాజకీయాల్లో తన ప్రస్థానాన్ని ప్రారంభించి 2001లో జిల్లా పరిషత్ చైర్మన్ స్థాయికి ఎదిగారని, ఎంత ఎదిగినా ఒదిగి ఉంటే మనస్తత్వం గల వ్యక్తని కొనియాడారు. ఆయన కుటుంబం మూడు తరాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారన్నారు. కార్యక్రమంలో వై.వి.సూర్యనారాయణ కుటుంబసభ్యులతో పాటు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి. పద్మావతి, కళింగ వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ అందవరపు సూరిబాబు, వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

హైరిస్క్ కార్డియాక్ రోగి కేశవరావుకు మెడికవర్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఆయనకు పెర్క్యుటేనియస్ నెఫ్రోలిథోట్రిప్సీ శస్త్రచికిత్స నిర్వహించి మూత్ర పిండ రాళ్లను తొలగించ గలిగామని కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్. ఎస్.సందీప్‌వర్మ కోసూరి వెల్లడించారు. పునరావృతమయ్యే అంటువ్యాధులు, బలహీనమైన మూత్రపిండాల పనితీరుకు కారణమవుతున్నాయని గుర్తించి ఈ శస్త్రచికిత్స నిర్వహించినట్టు ఆయన తెలిపారు. రోగికి తీవ్రమైన కార్డియాక్ కాంప్లికేషన్స్ వల్ల యురేటరల్ స్టెంట్ వేసుకోవడం జరిగిందని, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు, హైపర్ టెన్షన్, పార్శ్వ నొప్పి, హెమటూరియా, డైసూరియా ఇన్ఫెక్షన్ సంకేతాలు కనిపించడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ఆ సమయంలో మెడికవర్ ఆస్పత్రికి తీసుకురావడం వల్ల గుండె పనితీరును అంచనా వేయడానికి ఎకోకార్డియోగ్రఫీ, ప్రీ-ప్రొసీజర్ బ్రిడ్జింగ్ థెరపీ నిర్వహించినట్టు తెలిపారు. స్థిరమైన మూత్రపిండ, గుండె పరామితులతో విజయవంతంగా ఆయనను డిశ్చార్జ్ చేశామని తెలిపారు. మెడికవర్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలు ఉండడం వల్లే ఇది సాధ్యమైందని ఆయన వివరించారు.



రోగితో వైద్యాధికారి సందీప్ వర్మ

పాపారావు మాస్టారు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సంతబొమ్మాళి మండలం సీతానగరం మండల పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ పొందిన బొడ్డేపల్లి పాపారావు సేవలు ప్రశంసనీయమని అమరావతి అదనపు సంచాలు రోణంకి గోవిందరావు అన్నారు. పాపారావు ఉద్యోగ విరమణ ఆత్మీయ సభ పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఉపాధ్యాయులుగా విధులో చేరి మండల రిసోర్స్‌పర్సన్‌గా, స్కూల్ అసిస్టెంట్‌గా సేవలు అందించారని అన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారన్నారు. సమాజంలో ఎంతోమంది ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడంలో పాపారావుకు దక్కుతుందన్నారు. పాపారావు మాస్టారు మాట్లాడుతూ ఇంతమంది ఆత్మీయులతో వీడ్కోలు సభ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి తులసమ్మ, బొడ్డేపల్లి ఉదయ్, పొన్నాడ ఆశ, డాక్టర్ బొడ్డేపల్లి మాధురి, మొదలవలస సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాపారావు



విద్యార్థినులతో మాట్లాడుతున్న శశిభూషణరావు

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కెజిబివిని సమగ్ర శిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శశిభూషణరావు శుక్రవారం సందర్శించారు. ముందుగా జూనియర్ కళాశాలను సందర్శించి నాడు-నేడు పనుల్లో మిగిలిన సామగ్రిని తనిఖీ చేశారు. అనంతరం కెజిబివిలో విద్యాపరమైన అంశాలను బాలికలను ప్రశ్నించి సమాధానాలను రాబట్టారు. పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం స్టోర్ రూమ్‌లను పరిశీలించి వంటగదిలో ఆహార పదార్థాలను రుచిచూశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.దేవేందరరావు మల్లారెడ్డి పద్మనాభరావు, ప్రిన్సిపాల్ పైడి పద్మావతి, రమ్య పాల్గొన్నారు.

ప్రయాణికులకు అందుబాటులో సేవలు

పలాస: ప్రయాణికులకు అందుబాటులో సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్ సీతారాంనాయుడు అన్నారు. కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో కాశీబుగ్గ జిఎన్‌వి ఆర్థిక సహాయంతో ప్రయాణికుల బస్సు టిక్కెట్లను ప్రయాణికుల సమక్షంలో శుక్రవారం లక్కీ డ్రా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లె వెలుగులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు బస్సు దిగే సమయంలో బస్సు టిక్కెట్ వెనుక భాగంలో పేరు, ఊరు పేరు, ఫోన్ నంబరు రాసి లక్కీ బాక్సులో వేయాలన్నారు. నెలలో రెండుసార్లు లక్కీ డ్రా తీస్తామన్నారు. అందులో గెలుపొందిన విజేతలకు కాశీబుగ్గ జిఎన్‌వి బంగారం షాపు యాజమాన్యం బహుమతులు అందజేస్తారని చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి గ్రైండర్, రెండో బహుమతి ఎలక్ట్రికల్ కుక్కర్, మూడో బహుమతి ఎలక్ట్రికల్ కళాయి అందజేశారు. కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్‌వర్మ, టంకాల వెంకటేష్, కొర్రాయి సింహాచలం, బి.వెంకటరావు, బి.మణికంఠ పాల్గొన్నారు.



చిన్నారితో లక్కీడ్రా తీయిస్తున్న మేనేజర్ సీతారాంనాయుడు

విజేతలు వీరే

సోంపేట మండలం బెంకిలికి చెందిన పొందర శ్రావణి (7893400747) మొదటి బహుమతి గెలుచుకున్నారు. కవిటి ప్రాంతానికి చెందిన సుధాసాహు (8279985237) రెండో బహుమతి గెలుచుకున్నారు. సోంపేట మండలం శాసనంకు చెందిన మహంతి దీనబంద్ (8466026955) మూడో బహుమతిను గెలుపొందారు. విజేతలు ఆర్‌టిసి డిపో అధికారులకు సంప్రదించి బహుమతులు తీసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.



పొన్నుటూరులో అన్నదానం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని పొన్నుటూరులో కోదండ రామాలయం ప్రతిష్ట సందర్భంగా శుక్రవారం వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి యాత్రికులు పాల్గొన్నారు. సర్పంచ్ ఎద్దు చామంతి, ఎద్దు సంతోష్, అప్పారావు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడి

రణస్థలం రూరల్: రైతులు సేంద్రీయ ఎరువుల వాడడం వలన పంట దిగుబడితో పాటు ఆరోగ్యానికి భద్రత ఉంటుందని డిఎల్‌పిఒ, మండల ప్రత్యేకాధికారి ఐ.వి.రమణ, ఇఒపిఆర్‌డి వి. ప్రకాశరావు అన్నారు. మండలంలోని కోటపాలెం పంచాయతీలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా తయారు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై గ్రామస్తులకు అవగాహన కల్పించాల న్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పెంచుతున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. సేంద్రియ ఎరువులతో పండిస్తున్న కూరగాయలను విద్యార్థులకు ఆహారంగా అందించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ సుంకర ధనుంజయరావు, ఇన్‌ఛార్జి కార్యదర్శి ఆర్.శ్రీధరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రకాశరావు

పశు వైద్య కేంద్రానికి భవనం పరిశీలన



భవన పరిశీలన చేస్తున్న అధికారులు, నాయకులు

ఆమదాలవలస: పట్టణంలోని మెట్టక్కివలసలో పశువైద్య కేంద్రానికి పశు వైద్యాధికారులు భవన పరిశీలన చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు మెట్టక్కివలసలోని పలు భవనాలను టిడిపి నాయకులు, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారులు పరిశీలించారు. మెట్టక్కివలస, పరిసర ప్రాంతాల్లో ఉన్న పశుపోషకులు ఎమ్మెల్యే రవికుమార్‌కు గతంలో పశువుల వైద్యానికి పడుతున్న ఇబ్బందులపై ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో ఆ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే పశువైద్య కేంద్రాన్ని మెట్టక్కివలసలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరడంతో ఆ దిశగా అధికారులు శుక్రవారం పలు భవనాలను పరిశీలించారు. పశు వైద్య కేంద్రాన్ని ఏర్పాటుకు అన్ని వసతులతో కూడిన భవనం, ఇన్ఫ్రాస్ట్రక్చర్ కావాల్సి ఉందని అధికారులు తెలపడంతో మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రతినిధి తమ్మినేని విద్యాసాగర్ అన్ని వసతులతో కూడిన భవనం, ఫర్నిచర్‌ను తాను సమకూరుస్తానని తీర్మానాలను రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు, టిడిపి నాయకులు కొండబాబు, నాగళ్ల మురళీధర్, రాడ విజయ్ కుమార్, కారుణ్య ధర్మారావు, జామి రమణయ్య, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు, అచ్యుతరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డ్రోన్ నిఘా

శ్రీకాకుళం : శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని భైరివానిపేట, శాంతి నగర్ కాలనీ, నాగావళి నది పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాల్లో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో శుక్రవారం డ్రోన్ నిఘా పెట్టారు. ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా పెట్టారు. బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవిటీజింగ్, చైన్ స్నాచింగ్ తదితర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు.

ప్రసాద్ సేవలకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో ఎఒగా సుదీర్ఘకాలం సేవలందించి, ఉద్యోగ విరమణ చేసిన బివిఎస్ ప్రసాద్‌ను కార్యాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడి కె.రాజగోపాల్ మాట్లాడుతూ ప్రసాద్ ఎంతో అంకితభావంతో పని చేశారని ప్రశంసించారు. దస్త్రాలు తయారు చేయడంలో ఆయనకు విశేష నైపుణ్యం ఉందన్నారు. ప్రసాద్‌ను స్ఫూర్తిగా తీసుకుని అందరూ పని చేయాలని సూచించారు. సభలో డిడి జయరాజ్, డా. రామ్మోహన్, విపిసి డిప్యూటీ డైరెక్టర్ డా. మనోజ్, రిటైర్డ్ జెడి ఎం.కిషోర్, మురళీధర్, జిల్లా పశుసంవర్ధకశాఖ అసోసియేషన్ సభ్యులు, ప్రసాద్ కుటుంబసభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

పాల దిగుబడికి మేత ముఖ్యం



దుర్గారావు, ఎడి

రణస్థలం: పాల దిగుబడి పశువులకు వేసే మేతపైనే ఆధారపడి ఉంటుందని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు బుడుమూరు దుర్గారావు పాడి రైతులకు సూచించారు. రణస్థలంలో తన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ చాలామంది రైతులు పశువులకు వేసే మేతపై అవగాహన లేకపోవడంతో అధిక పాలను పొందలేకపోతున్నారని, వరిగడ్డితో పాటు సమీకృత దాణాను అందించినప్పుడే పాల ఉత్పత్తి మరింత పెరుగుతుందన్నారు. రెండు లీటర్లకుపైగా పాలిచ్చే పశువులకు తప్పనిసరిగా సమీకృత దాణాను ఇవ్వాలన్నారు. పాలిచ్చే గేదెలకు ప్రతి 2 లీటర్లకు కిలో చొప్పున, అదే పాలిచ్చే ఆవులకు ప్రతి 2.5 లీటర్లకు ఒక కిలోచొప్పున సమీకృత దాణాను అందించాలన్నారు. వీటితో పాటు ఒక్కో పశువుకు రోజూ 10 కిలోల పచ్చిమేత, 4 కిలోల ఎండు గడ్డి కూడా అందిస్తే పాల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. దీనివల్ల పశువుల్లో రోగనిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చునని, పాడి పెంపకం చేపడుతున్న రైతులు వేరే చోటు నుంచి పచ్చిగడ్డిని తెచ్చుకోవడానికి బదులుగా తమ పొలంలోనే కొంత చొప్పు సాగు చేసుకోవడం ఉత్తమమన్నారు. దానిని నేరుగా పశువుకు వేయకుండా గడ్డి కత్తిరించే యంత్రాలతో చాపింగ్ చేసి పశువులకు పెట్టాలని, తద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. అలాగే ఎండలో మరిగిన నీటిని తాగడం పాడి పశువులకు మంచిది కాదని, అందుకే నీటి తొట్టెలను నీడ, చల్లని ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని, పశువులకు అందించే మేతలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ఇచ్ఛాపురం: బాహుదా నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జోరుగుతా సాగుతున్నాయి. దీనిపై తహశీల్దార్ వెంకటరావు స్పందించి శుక్రవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారన్నారు. బాహుదా నది ఒడ్డున వాహనాలు వెళ్లే మార్గాల్లో ఈ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ఈ విషయమై పట్టణ పోలీస్‌స్టేషన్, మున్సిపాలిటీ, ఇరిగేషన్ కార్యాలయానికి సమాచారం అందజేశామన్నారు. ఇక నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే అపరాధ రుసుం విధించి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న తహశీల్దార్ వెంకటరావు



మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

గంజాయితో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని జర్జంగి సమీపంలో సాయిశాన్విక దాబాలో శుక్రవారం అక్రమంగా విక్రయిస్తున్న ఐదు కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకొని సంబంధిత నాలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. తమకు వచ్చిన సమాచారం మేరకు దాబా వద్ద తనిఖీలు నిర్వహించక పలు విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇక్కడకు కేరళ నుంచి ఒడిశా వెళ్లి ఓ ప్రవేటు బస్సు ప్రతి మంగళ, శుక్రవారాలు ఈ దాబా వద్ద ఆగి భోజనాలు చేస్తుంటారని అన్నారు. అయితే దాబా యజమాని సారవకోట మండలం జగన్నాథపురానికి చెందిన కొల్లి బాలరాజు, సమీపంలో ఉన్న ఒక గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన మోహన్‌లాల్ జంగిల్, ఒడిశాకు చెందిన బిరేస్వర్ బిస్వస్‌లు గంజాయికి అలవాడు పడ్డారని అన్నారు. అయితే ఈ ప్రయివేటు బస్సులో పనిచేస్తున్న కేరళకు చెందిన శ్రీజిత్ విజయన్ ఈ దాబాలో యజమాని బాలరాజు అనుమతితో గంజాయి సేవిస్తుండగా, తమకు అలవాటు ఉందని మాకూ సరఫరా చేయాలని కోరారని అన్నారు. ఆయన ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి విరివిగా ఈ దాబా యజమానికి అందజేసుండేవాడని తెలిపారు. అయితే తమకు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ వి.సత్యనారాయణ, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారని అన్నారు. ఈ సమయంలో నిందితులు పరారయ్యే ప్రయత్నంలో జర్జంగి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వారికి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.



ఢీకొన్న చెరుకు లారీ, ఆర్‌టిసి బస్సు

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారున ఉన్న శ్రీకాకుళం పాలకొండ రహదారి ఫ్లైఓవర్ దిగువున శుక్రవారం చెరుకు లారీ, బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రమాదం జరగక పోవడంపై ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీకాకుళం వైపు నుంచి సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న చెరుకులోడు లారీ ఫ్లైఓవర్ దిగుకు చేరుకుంటున్న సమయంలో హిరమండలం వైపు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు కూడా ఫ్లైఓవర్ మీదకు వెళ్తున్న సమయంలో లారీలో ఉన్న చెరుకు కట్టలు బస్సు ముందు భాగం అద్దాల లోపలికి వెళ్లడంతో ఇరు వాహనాలకు చెందిన డ్రైవర్లు అప్రమత్తం కావడంతో రెండు వాహనాలను అక్కడే నిలిపివేసి చాకచక్యంగా వ్యవహరించి ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. ఈ సంఘటనతో సుమారు 30 నిమిషాలు పాలకొండ, శ్రీకాకుళం, ఆమదాలవలసకు రాకపోకలు స్తంభించి పోవడంతో సిఎస్‌పి రహదారిలో వాహనాలు బారులు తీరాయి. భారీలోడ్లతో రాత్రిపూట వెళ్లాల్సిన చెరుకు, ఊక తదితర లారీలు పట్టపగలే రహదారిపై ప్రయాణిస్తుండడంతో బిక్కు బిక్కుమంటూ ప్రయాణాలు కొనసాగిస్తున్నామని పలువురు వాహనదారులు, ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు ఇటువంటి వాహనాలపై దృష్టి సారించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దళ్లవలస విఆర్‌ఒ సరెండర్


ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని దళ్లవలస విఆర్‌ఒ తవుడుపై పలు ఆరోపణలు నేపథ్యంలో శ్రీకాకుళం ఆర్‌డిఒకు సరెండర్ చేసినట్లు శుక్రవారం తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు తెలిపారు. గతంలో పొందూరు విఆర్‌ఒగా పనిచేసిన తవుడుపై పలు ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నింటిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులు, ఆరోపణలపై విచారణ జరిపిన తహశీల్దార్ ఆరోపణలు ఆధారాలతో నిరూపణ కావడంతో కలెక్టర్‌కు పూర్తిస్థాయి నివేదిక అందించినట్లు పేర్కొన్నారు. నివేదిక మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు కలెక్టర్ ఆదేశించడంతో విఆర్‌ఒ తవుడును శ్రీకాకుళం ఆర్‌డిఒకు సరెండర్ చేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

కృష్ణమూర్తి మాస్టారు ఆదర్శనీయులు

ప్రజాశక్తి- సోంపేట

అంబటి కృష్ణమూర్తి మాస్టారు జీవితం విద్యార్థులకే కాక నేటి తరానికి ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. మందస మండలం బహడపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం కృష్ణమూర్తి మాస్టారు ఉద్యోగ విరమణ పురస్కరించుకొని ఆత్మీక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కష్ణమూర్తి మాస్టారు, గీతాంజలి దంపతులకు దుశ్శాలు కప్పి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, సర్పంచ్ ఉదయ్ కుమార్ మాట్లాడారు. కృష్ణమూర్తి మాస్టారు జీవితంలో ఎంతోమంది శిష్యులకు ఉత్తమ శిక్షణ అందించి, మంచి భవిష్యత్ బాటలు వేశారన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై తన అనుభవాన్ని సమాజ నిర్మాణానికి ఉపయోగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కష్ణమూర్తి మాస్టారు స్వగ్రామమైన ఎర్రముక్కానికి చెందిన గ్రామపెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న చంద్రమోహన్

గురువులది అగ్రస్థానం

ప్రజాశక్తి- కవిటి

భవిష్యత్ తరాలను తయారు చేసే ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని, మన పూర్వీకులు తల్లి, తండ్రి తర్వాత గురువుకే అగ్రస్థానం కల్పించారని డిఇఒ తిరుమల చైతన్య అన్నారు. మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లెక్కల ఉపాధ్యాయులు గరుడాచలం శంకరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణంగా ఉద్యోగ విరమణ పొందిన తర్వాత చాలామందికి తాము పనిచేసే సంస్థలు, వ్యవస్థలతో చాలావరకు సంబంధాలు తెగిపోతాయని అన్నారు. కానీ, ఒక్క ఉపాధ్యాయుడికి మాత్రమే ప్రతి దగ్గరా తాను చదువు చెప్పిన ఎవరో ఒకరు శిష్యుడు ఉండనే ఉంటాడని అన్నారు. అటువంటి మహోన్నత వృత్తిలో అకుంఠిత దీక్షతో పనిచేసి, ఎంతోమంది విద్యార్థులను గణితంలో తీర్చిదిద్దిన శంకరరావు మాస్టారి విశ్రాంత జీవితం ప్రశాంతంగా సాగిపోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు శంకరరావు మాస్టారు దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి దుద్ది సతీష్, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ్, గ్రామస్తులు, ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య


సమావేశంలో మాట్లాడుతున్న రాజారావు

పరిశ్రమలతో యువతకు ఉపాధి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో పరిశ్రమలు ఏర్పాటు జరిగితే నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని మండల తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావు అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో తెలుగు యువత ఆధ్వర్యంలో పవర్‌ప్లాంట్ ఏర్పాటుపై యువతతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దు ప్రాంతంలో ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో జెన్కో క్రిటికల్ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సిఎం చంద్రబాబునాయుడుతో పాటు ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషి అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు జరిగితే నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. నియోజకవర్గ పరిధిలో పరిశ్రమలు లేక ఇప్పటికే ఈ ప్రాంతం వెనుకబడి పోయిందన్నారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు దవళ సింహాచలం, ఎండ రామారావు, దొరబాబు, కొమనాపల్లి రవికుమార్, బసవ ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు ఇండియన్ ఐకాన్ పురస్కారం

ప్రజాశక్తి- కవిటి


వినోద్‌కుమార్

శాస్త్రీయ సంగీతంలో విశిష్ట ప్రతిభ కనబరుస్తూ శ్రోతలను అలరిస్తున్న కవిటి మండలం కపాసుకుద్దికు చెందిన మృదంగం కళాకారుడు చలపరాయి వినోద్ కుమార్ ఇండియన్ ఐకాన్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని ప్రకటించాయి. ఫిబ్రవరి 2 తేదీన తుమ్మనపల్లి కళాక్షేత్రం విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డు అందించనున్నట్టు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మండలి లక్ష్మణబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు అద్దంకి నాగరాజు, కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జాతీయ సమన్వయకర్త వేములవాడ రాధిక తెలిపారు.

జానకిరామ్‌రెడ్డికి నంది పురస్కారం


జానకిరామ్‌రెడ్డి

ఇచ్ఛాపురం: తెలుగు సాహితీ, కళారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న జానకిరామ్‌రెడ్డికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు నంది పురస్కారానికి ఎంపికయ్యారు. జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యాన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు సందర్భంగా ఇచ్ఛాపురానికి జానకిరామ్‌రెడ్డిను ఎంపిక చేశారు. తెలుగు సాహిత్య వేత్తగా, జానపద సంగీత కళా రంగంలో విశిష్టమైన కృషి చేస్తున్నారు. ఈయన ఎంపికపై పలువురు అభినందించారు.

విద్యార్థినిపై దాడి బాధాకరం

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతీదివ్య

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జిల్లా కేంద్రంలో డిగ్రీ విద్యార్థినిపై దాడి బాధాకరమని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతతకు నిలయమైన చిక్కోలులో విద్యార్థినిపై దాడి మనసును కలిచివేస్తుందన్నారు. దీనికి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుని విద్యార్థినికి ఉచితంగా వైద్యం అందించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మారకద్రవ్యాలను కలిసికట్టుగా నిర్మూలిద్దామని ఎస్ఐ పి.రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పెద్దమడి ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులకు డ్రగ్స్ వ్యతిరేకంగా శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చేందుకు కృషి చేయాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను చెడుగొట్టుకోవద్దని సూచించారు. ఎక్కడైనా గంజాయి అమ్మినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలన్నారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు ఉన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ (ఐజిడి) ఢిల్లీ వారిచే శుక్రవారం అయోడిన్ లోపం వల్ల పిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజిడి శ్రీకాకుళం జిల్లా కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు మండలాల పరిధిలోని 40 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఆశీర్వాద స్మార్ట్ ఇండియా ఆర్థికసాయంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అలాగే రిసోర్స్‌పర్సన్ విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డా.చంద్రశేఖర్ మాట్లాడుతూ అయోడిన్ తీసుకోకపోతే డ్రై స్కిన్, ఎదుగుదలలో లోపం, థైరాయిడ్, బలహీనత, రక్తహీనత ఏర్పడుతుందని, దానిని నిర్మూలిం చుటకు ఆయోడిన్ సాల్ట్‌ను మాత్రమే వాడాలన్నారు. ఆకుకూరలు, పప్పు దినుసులు, పాలు, గుడ్లు ,డ్రై ఫ్రూట్స్ నిత్యం తగు


అయోడిన్ అవగాహనా సదస్సులో పాల్గొన్న ఐజిడి సిబ్బంది

మోతాదులో తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బల్ల కంటయ్య, విజయనగరం జిల్లా కో-ఆర్డినేటర్ అశోక్, ఉపాధ్యాయ, వైద్య, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటిబొట్టూ వినియోగం


చెక్కును అందజేస్తున్న నిరంజన్

ప్రజాశక్తి- పలాస

ప్రతినీటి బొట్టూ రైతులకు వినియోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని నీటి వినియోగదారుల సంఘం తీర్మానించారు. శుక్రవారం మున్సిపాలిటి ఆరో వార్డు అంతరకుడ్డలో నీటి సంఘం చైర్మన్ గొనప నిరంజన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత్తూ ఎంతో సదాశయంతో రైతులు తవను ఎన్నుకున్నారని అన్నారు. వంశధార నీటితో పాటు చెరువుల్లో ఉన్న నీటిని సరైన పద్ధతిలో పంటలకు వినియోగించి అధిక దిగుబడి కోసం కృషి చేస్తానని అన్నారు. 2018లో నీటి సంఘం ద్వారా చేసిన పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని అన్నారు. దీన్ని సంబంధిత కాంట్రాక్టర్లకు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అనంతరం కొర్రాయి జనార్ధన నీరు-చెట్టు కింద పనులు చేసినందుకు ప్రభుత్వం రూ.1.30 లక్షలు విడుదల చేసిందని, దీన్ని సంబంధిత రైతుకు చెక్కు రూపంలో అందించామని అన్నారు.

అలుపెరుగని పోరాటం

కవిటి: అపరిష్కృత సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేస్తున్నామని నియోజకవర్గ బెంతు ఒరియాలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి కవిటి బస్టాండ్ ఆవరణలో బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 401వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా బెంతు ఒరియాల యూత్ అధ్యక్షుడు సుమన్ బిసాయి మాట్లాడుతూ ఏడాదికి పైగా తాము దీక్షలు చేస్తున్నా ఇప్పటికీ తమ సమస్యల పరిష్కారానికి మార్గం కనిపించడం లేదని అన్నారు. మరోవైపు తమ విద్యార్థుల తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, యువత ఉద్యోగాలు



దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యకు పరిష్కారం చూపించి న్యాయం చేయాలని కోరారు. ఈ దీక్షలో విశ్రాంత ఉద్యోగులు మేఘనాథ్ బిసాయి, గుణనిధి దలై, హరికృష్ణ బిసాయి పాల్గొన్నారు.

పలువురు రక్తదానం

శ్రీకాకుళం అర్బన్: ప్రజా సేవల్లో ప్రజల మన్ననలను పొందిన వ్యక్తి స్వర్గీయ గొలివి అప్పారావు నాయుడని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ గొండు గంగాధర్ అన్నారు. శుక్రవారం అప్పారావు నాయుడు నాలుగో వర్థంతి పురస్కరించుకుని ఆయన కుమారుడు నర్సు నాయుడు ఆధ్వర్యాన రెడ్‌క్రాస్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన చనిపోయినా ఆయన జ్ఞాపకార్థం వారసులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

పర్లాకిమిడి: ఆడపిల్లలను తప్పకుండా చదివించి వారికి అన్ని విధాలా రక్షణ కల్పిద్దామని కాశీనగర్ సమితి అధ్యక్షులు బల్ల సాయమ్మ అన్నారు. గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలో ఐసిడిఎస్ ఆద్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు 'బేటీ బచావ్' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బిజు కల్యాణ మండపం నుంచి స్టేట్ బ్యాంకు కూడలి వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు, పాటలతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బిజు కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాశీనగర్ ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి, కాశీనగర్ బిడిఒ డంబరుదర మల్లిక్, కాశీనగర్ బిఇఒ ఆదికొందో గొమాంగో, కాశీనగర్ సిడిపిఒ కనకలత పూజారి, సూపర్‌వైజర్లు భాగ్యవతి, నాగావంశి, పద్మావతి పట్నాయక్, ఇందిరా పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు


ఇంటిపై ఉన్న విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ముచ్చింద్రలో విద్యుత్ వైర్లు ఇంటి మేడపై ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. శ్లాబ్ ఎక్కితే చేతికి తగిలే ఎత్తులో ఉన్నాయి. దీంతో నిత్యం ప్రమాదాలు బారిన పడిన ఘటనలు ఉన్నాయి. ఇటీవల చిన్నారి చేతులు పొరపాటున విద్యుత్ వైర్లు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదాలపై విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా ప్రయోజనం లేకుండాపోయింది. విషయం తెలుసుకున్న సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. వెంటనే విద్యుత్‌శాఖ అధికారి పృథ్వీతేజ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే స్పందించి వైర్లను మార్పు చేయాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో ఓటర్ల నమోదు

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన కొత్త ఓటర్లు నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తహశీల్దార్ ఎన్.వెంకటరావు పర్యవేక్షణలో యువజన ఓటర్లు నమోదు చేశారు. మొత్తం 52 మంది నమోదు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు తహశీల్దార్‌కు ఎన్ఎస్ఎస్ పిఒ సంతోష్ కుమార్ దరఖాస్తులను అందించారు. నాలుగు రోజుల్లో మరో 38 దరఖాస్తులు అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్ పాడి, వైస్ ప్రిన్సిపాల్


దరఖాస్తులను అందజేస్తున్న సంతోష్‌కుమార్

శ్రీనివాసరావు ఓటరు నమోదరపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు దుర్యోధన, శివకుమర్, నాగేశ్వరరావు, రాధ, సీతమ్మ, త్రిపాఠి పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

పాతపట్నం : ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను పాడి రైతులు అందరూ వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు పిలుపునిచ్చారు. మండలంలో సరాలిలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని సందర్శించారు.

మందస : మండలంలోని సిరిపురం, భోగాపురం గ్రామాల్లో హరిపురం పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతిలు పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేయడం, దూడలకు అంతర పరాన్న జీవులు మందులు తాగించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ధనుంజయరావు, బాలకృష్ణ, శ్రీను, సంతోషి, హరికృష్ణ, కళ్యాణ్, నేతాజీ, లక్ష్మి, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమా, మురళి, ఇంతియాజ్, పురుషోత్తం పాల్గొన్నారు.

నాటిక పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను నిర్వహించనున్నట్టు రంగస్థలం కళాకారుల సంఘం అధ్యక్షులు, రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పాలపోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో రంగస్థల కళాకారుల సంఘం కార్యదర్శి పేడాడ వెంకట ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో నాటిక పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులను ఈ నాటిక పోటీలకు ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ నాటిక పోటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారులు, దాతల సౌజన్యంతో ప్రతిరోజు మూడు నాటికలు ప్రదర్శించబడతాయని, ఆమదాలవలస కళాకారుల సంఘం అధ్యక్షులు టేకి తిరునాధరావు, కార్యదర్శి బగాది వెంకటరమణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాకారుల సంఘం ప్రతినిధులు

ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థలం, టీవీ, ఆల్ ఇండియా రేడియో కళాకారులు డాక్టర్ గోకవలస కృష్ణమూర్తి, కలియుగ నక్షత్రక పద్మశ్రీ యడ్ల గోపాలరావులను సన్మానించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు, కళాభిమానులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్‌జెడి, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, గొండు రవి, బొడ్డేపల్లి జనార్ధన రావు, కాగితాపల్లి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.


జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ శంకరరావు

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు అన్నారు. కళాశాల ద్వితీయ సంవత్సం చదువుతున్న ఎంపిసి విద్యార్థిని పి.బిందురెడ్డి ప్రథమ సంవత్సరం 470 మార్కులకు గాను, 457 కూర్కులు సాధించింది. జిల్లాలు ఛేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర బిందురెడ్డికి నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో సమావేశం ఏర్పాటు చేసి ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో ఎజిఎంఒ ప్రియా సుధాకర్, సిబ్బంది ఎన్.బాపూణ, పి.ప్రసాదరావు, కె.యుగంధర, బి.కరుణాకరరావు, రజనీకుమరి, జనార్ధనరావు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రైతు ఉత్పత్రాల సంఘాల ద్వారా పెరటి తోటలో బొప్పాయి, మునక పెంపకంపై ప్రాధాన్యత కల్పించాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు అన్నారు. సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎం సూర్య యోజన పథకం కింద ప్రతి కుటుంబానికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటిపైనా సౌర శక్తి పలకలు ఏర్పాటుకు బ్యాంకు ద్వారా వస్తున్న సబ్సిడీ స్కీమ్ గురించి వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యకు వివిధ బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు మంజూరు


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

చేయకపోవడంపై చర్చించారు. అర్హత ఉన్న సభ్యులందరినీ సంఘాలుగా చేర్పించడానికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బి.పార్వతి, చిట్టిబాబు సాహు, మోహనరావు, లక్ష్మి, మోహిని, విష్ణు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎస్ఐను కలిసిన టిడిపి నాయకులు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం టౌన్ ఎస్ఐగా ముకుందరావు ఇటీవల బాధ్యతలను చేపట్టారు. ఈ మేరకు టిడిపి నాయకులు జన్నేల సంతోష్, జిలాని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసిపి బలోపేతానికి కృషి

కోటబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గంతో బూత్ కమిటీల స్థాయి నుంచి కార్యకర్తలను బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయానికి ఇప్పటి నుంచే కృషి చేస్తానని బూతు కమిటీల నియోజకవర్గ అధ్యక్షులు సింగుపురం వినోద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మాజీ సిఎం, వైసిపి అదినేత జగన్, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అన్నెపు రామారావులు తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించారని అన్నారు.

సింహద్వారం ప్రతిష్ట

కవిటి: మండలంలోని రాజపురంలో లిమ్మాసుని అమ్మవారి ఆలయ సింహద్వారా శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, జనసైనికులు, స్థానికులు పాల్గొన్నారు.